# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 12, డిసెంబర్ 2025





# ప్రశాంతంగా మొదటి విడత సర్పంచ్ ఎన్నికలు

**☆ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త

జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తిగా శాంతియుతంగా, సజావుగా కొనసాగాయాని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం సిరికొండ, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పోలింగ్ పరిస్థితులను సమీక్షించారు. ముందుగా సిరికొండ మండలం సుంకిడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ శాతం పెరిగేలా, ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామంలోని జిల్లా మిగతా 2లో..




# మొదటి విడత ఎన్నికల ప్రక్రియ పూర్తి

**✳ మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ప్రభాతవార్త




2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి విడత ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని దొనబండ, సబ్బెపల్లి గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెద్దంపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు మిగతా 2లో..

# ప్రశాంతంగా కొనసాగిన ఎన్నికల ప్రక్రియ

**★ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

కెరమెరి, డిసెంబర్ 11, ప్రభాతవార్త

2వ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం కొరారి గ్రామపంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్.పి. నికిత పంత్, ఎన్నికల పరిశీలకులు వి.శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరిగిందని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచిస్తూ పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో పోటీ చేయు సర్పంచ్, వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నారని, జిల్లాలో ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా మిగతా 2లో..




# గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఉండాలి

**★ జిల్లా ఎస్పీ నితికా పంత్**

ఆసిఫాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :



గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు, ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకోకుండా చూసేందుకు మొత్తం 750 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు, క్యూఆర్టి టీంలు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధమని, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుట మిగతా 2లో..

# రేపే నవోదయ ప్రవేశ పరీక్ష

- ☆ ఆరో తరగతిలో చేరేందుకు ఎగ్జామ్
- ☆ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ☆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 పరీక్షా కేంద్రాలు
- ☆ హాజరుకానున్న 6196 మంది విద్యార్థులు




కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త

*కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ తెలిపారు. ఇందులో ఆరో తరగతిలో 80 సీట్లు ఉండగా, 6196 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఉదయం 10 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని, 11 గంటలకు అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.*

2 లో..

# ప్రశాంతంగా కొనసాగిన ఎన్నికల ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నమోదు చేయాలని స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం 1 గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు వరుసలో ఉన్న వారందరికీ ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని, సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవరిని అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపే నవోదయ ప్రవేశ పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 పరీక్ష కేంద్రాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 6196 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 1290 మంది విద్యార్థులకు 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా నుంచి 1552 మంది దరఖాస్తు చేసుకోగా 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి 1722 మంది విద్యార్థులకు 7 పరీక్షా కేంద్రాలు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 1632 మందికి 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా విద్యార్థులు జవహర్ నవోదయ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ తెలిపారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : రేపాల కృష్ణ, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం, కాగజ్‌నగర్

జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6196 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారికోసం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రానికి రావాలి. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్సు వెంట తెచ్చుకోవాలి. 11.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. ప్రతిభఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం మాత్రమే సీట్లు కేటాయిస్తారు.

# గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

కొరకు సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలని, ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మొదటి విడత ఎన్నికల ప్రక్రియ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవడం జరిగిందని తెలిపారు. మొదటి విడతలో భాగంగా జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో ఏకగ్రీవం అయిన స్థానాలను మినహాయించి మిగిలిన 81 గ్రామపంచాయతీ సర్పంచ్, 514 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా ఎన్నికల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలింగ్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. 80.04 శాతం ఓటింగ్ జరిగిందని, జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 14, 17 తేదీలలో జరగనున్న 2వ, 3వ విడతల ఎన్నికలను అధికారులు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మొదటి విడత సర్పంచ్ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)



పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వందశాతం పోలింగ్ సాధనే లక్ష్యంగా మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓటరు సహాయ కేంద్రం వద్ద ఓటర్ స్లిప్ పంపిణీపై బూత్ స్థాయి అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. తరువాత ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి పోలింగ్ ప్రక్రియ, సిబ్బంది నిర్వాహణ, లాజిస్టిక్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల పోలింగ్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రశాంతంగా సాగుతోందని తెలిపారు. అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేశామని చెప్పారు. 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, అలాగే ఓటర్ స్లిప్ చూపించి ఓటు వేయవచ్చని, ఈ విషయంపై బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు ముందుగా అవగాహన కల్పించామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి ఓటరును పోలింగ్ బూత్ వద్దకు చేర్చేందుకు యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. సమస్యాత్మక బూత్‌లను ప్రత్యేకంగా గుర్తించి, వాటిలోని పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, సిరికొండ తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవోలు రాయిస్‌ఉల్లా, రామ్ ప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్, ఇంద్రవెల్లి ఎంపీడీవో జీవన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

# జిమ్మిక్కుల సీసీఐ కొనుగోలు కేంద్రం

**– ఇష్టారీతిన ధరల నిర్ణయం – పత్తి తూకం వేయకుండా రిజక్ట్ చేయడంపై పత్తి రైతుల ఆందోళన**

బెల్లంపల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త



కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ఆదినాథ్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి తూకం వేయకుండా రిజక్ట్ చేయడం పై గురువారం కొనుగోలు కేంద్రం వేసిన నిరసన తెలిపారు. ప్రైవేటు కొనుగోలుదారులతో సిసిఐ కేంద్రం సిబ్బంది కుమ్మక్కయ్యారని రైతులు ఆరోపించారు. ఇక్కడ రిజెక్ట్ చేసిన పత్తికి తాండూరు మండలం రేపల్లెవాడలోని సిసిఐ కొనుగోలు కేంద్రంలో 8000 కుకింగ్ ధర వస్తుందన్నారు. టేకులపల్లిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో వచ్చిన పత్తి బండ్లను తూకం వేయకుండా రిటర్న్ చేయడంపై రైతులు మిల్లు యాజమాన్యంపై సీసీఐ కొనుగోలు కేంద్రం సిబ్బందిపై తిరుగుబాటు చేశారు. ప్రైవేటు కొనుగోలుదారులతో కుమ్మక్కై తమ పత్తిని రిజెక్ట్ చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇక్కడ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రంలో పలు అవకతవకలు జరుగుతున్నాయని పత్తి రైతులు ఆందోళనలకు దిగారు. రైతులను తేమ పేరుతో భయందోళనలకు గురి చేస్తున్నారని, సీసీఐ నిబంధనలకు విరుదంగా ప్రవర్తిస్తూ రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఇక్కడికి వచ్చిన పత్తిని కౌడి, చెత్త, తేమ పేరుతోని బంధనలకు విరుదంగా తక్కువ రేట్ కి కొనుగోలు చేసి తమను నిలువునా ముంచుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది రైతులు సీసీఐ కి అమ్మేందుకు ఆన్లైన్ చేసుకోవడానికి తగు పత్రాలు లేకపోతే బయట వారి వద్ద ప్రైవేట్‌కి 6950కి కొనుగోలు చేసి సీపీఓ కేంద్రం కింది అధికారులకు కొందరు తమ వద్ద ఉన్న నకిలీ పత్రాలు సమర్పించి సీసీఐకి తూకానికి వేసి లక్షలల్లో డబ్బులు దండుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి వెంటనే కొనుగోలు కేంద్రం సిబ్బందిపై, మిల్లు యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని పత్తి రైతులు డిమాండ్ చేశారు.

# సింగరేణి దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం

మందమర్రి, డిసెంబర్ 11, ప్రభాతవార్త

ఈ నెల 23న సింగరేణి దినోత్సవ వేడుకలను మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఘనంగా నిర్వహించేందుకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్ని గనుల డిపార్ట్మెంట్ల అధికారులతో, ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 23న నిర్వహించే సింగరేణి దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ వేడుకలో అన్ని రకాల ఆహార స్టాల్స్, కంపెనీకి సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి దినోత్సవ వేడుకలను ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, ప్రజలు విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జి ఎల్. ప్రసాద్, ఏరియా (ఈ అండ్ ఎం) భగవతి జ, ఎస్.కె ఏజెంట్ ఖాదిర్, డీజీఎం (పర్సనల్) సిహెచ్ అశోక్, డీజీఎం (ఐడి) కిరణ్ కుమార్, డి వై సి ఎం ఓ ఏరియా హాస్పిటల్ మధు కుమార్, సివిల్ (ఎస్సీ) శ్రీధర్, ఎన్విరాన్ మెంట్ అధికారి వెంకట్ రెడ్డి, మందమర్రి ఏరియా ఉన్నత అధికారులు, గని మేనేజర్లు, గనుల, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ఎన్. రాధాకృష్ణ

# పల్లె పోరు ప్రశాంతం..

*** మొదట మందకోడిగా పోలింగ్ * ఓటింగ్ ముగిసేసరికి 79.81 శాతం నమోదు**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 5 మండలాల్లో చేపట్టిన మొదటి విడత ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారులు నిర్వహణను ప్రణాళిక బద్దంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మొదటి విడత జిల్లాలోని ఐదు మండలాలలో జరిగిన ఎన్నికల్లో 114 గ్రామపంచాయతీలలో ఐదు ఏకగ్రీవం కాగా మిగతా చోట్ల సర్పంచ్ పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు.106 గ్రామపంచాయతీలు, 368 వార్డు సభ్యులకు ఎన్నికలు జరిగాయి. జైనూర్ 76.81 శాతం, కెరమెరి 83.38, లింగాపూర్ 79.61, సిర్పూర్ యు 81.18, వాంకిడి 78.93 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఐదు మండలాల్లో 96068 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 76668 ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటి విడత ఐదు మండలాల్లో కలిపి 79.81 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 48230 మంది పురుషుల ఓట్లు ఉండగా 38824 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా 49082 మహిళలు ఉండగా 37844 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.



బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## సెక్యూరిటీ సిబ్బందికి ఆన్ డ్యూటీ గా పరిగణించాలి

**తాండూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

గ్రామపంచాయతీ ఎన్నికలలో విధులు నిర్వహించే సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి స్పెషల్ లీవ్ బదులుగా ఆన్ డ్యూటీ పరిగణించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డికి గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీలో ఆన్ డ్యూటీ ఇవ్వకుండా, స్పెషల్ లివ్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. ఆన్ డ్యూటీ గా పరిగణించి టిఏ, డిఏ చెల్లించాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్యూరిటీ సిబ్బంది జమీదార్ అంజయ్య, సహాయ కార్యదర్శి, జహంగీర్, రమేష్, నాయకులు కిరణ్ బాబు, మారం శ్రీనివాస్, ఆదం సమీ, అన్వేష్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఉదయ్ బాబు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11,ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడిగా మర్యాల ఉదయ్ బాబు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఏకిరాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పాత శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వాసవి మాత మందిరంలో జరిగిన సమావేశంలో వాసవి క్లబ్ 2026 సంవత్సరంనకు నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శిగా బాల శ్రీనివాస్, కోశాధికారిగా కలకుంట్ల శ్రీధర్లను ఎంపిక చేసిన్నట్లు వెల్లడించారు.

## లింగాపూర్ మండలంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాలు

**లింగాపూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ఫలితాలు, కిమ్మా నాయక్ తండా, రాథోడ్ లలిత రవీందర్, గుమునూర్ ఆత్రం శేష నారాయన్, జాముల్ ధర, జుగునాక గంగాదేవి రమేష్. చోరుపల్లి అనసూయ జుగాదిరావు. పిట్టే గూడ బానోత్ సునీత. చిన్న దంపూర్, రాథోడ్ సులోచన. ఎల్లాపాటర్ పవర్ బబ్లు. కొత్తపల్లి రాథోడ్ ఉదయ్ సింగ్. లింగాపూర్ జాదవ్ రాజశేఖర్. పికలతండా బానోత్ కిసాన్. మోతి పాటర్ ,రాథోడ్ సునీత . కొత్తపల్లి రాథోడ్ ఉదయ్ సింగ్ .సర్పంచులుగా గెలుపొందారు.

## ఇందారం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఫయాజ్

**- డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి**

**జైపూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త**

ఇందారం సర్పంచ్గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మహ్మద్ ఫయాజ్ అని మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డిస్పష్టం చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఇందారం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఇందారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఎండి ఫయాజ్కు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ బలపరిచిన ఎండి ఫయాజ్ ఫూట్ బాల్ గుర్తుకు ఒటేసి గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రానున్న మూడేళ్లలో ప్రజా సంక్షేమ కోసం మరిన్ని పథకాలు అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో గ్రామ అభివృద్ధి సాధ్యం అన్నారు. కార్యకర్తలను గుర్తించి సరైన సమయంలో పదవులు, ఎలక్షన్లలో సీట్లను కేటాయిస్తూ వారి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలని కోరారు.





క్షయ వ్యాదిపై అవగాహన కల్పిస్తున్న డా. సుమలత

## క్షయ వ్యాధి గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**బజార్హత్నూర్, డిసెంబర్ 11, ప్రభాతవార:**

క్షయ వ్యాధి గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ వ్యాధి వైద్యురాలు డా సుమలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం క్షయ వ్యాధి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా తీసుకునే జాగ్రత్తల గురించి, వచ్చిన తర్వాత తీసుకునే తగు జాగ్రత్తలు గురించి, మందుల వాడకం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు దాదాపు 80 మంది వరకు ఎక్సరే తీసి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి సూపర్వైజర్ సుధా, డా. భీమ్రావు, హెచ్ఇఒ సూర్యప్రకాష్, క్షయ వ్యాధి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సర్పంచ్ అభ్యర్థి గంగారం తరుపున ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎలుక రాం చందర్

## బిఆర్ఎస్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించండి

**- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు**

**తాండూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి నియోజకవర్గంలో రెండో విడతలో జరగనున్న సర్పంచ్, వార్డు స్థానాలలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. తాండూర్ గ్రామ పంచాయతీ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి దుర్గం గంగారం తరపున గురువారం బిఆర్ఎస్ నేత చిలుక రాంచందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వాడ వాడల తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారటి పథకాలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి సర్కార్ విఫలం చెందిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి రావాలంటే సబ్బండ వర్గాల ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాండూర్ సర్పంచిగా పోటీ చేస్తున్న దుర్గం గంగారం బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో బిఆర్ఎస్ నాయకులు దత్తాత్రేయరావు, పురుషోత్తం గౌడ్, అర్జున్, బండి సంతోష్, అబ్బుసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రామ పంచాయితీ ఎన్నికలు

**జన్నారం, డిసెంబర్ 11, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని 29 గ్రామాల్లో పంచాయితీ ఎన్నికలు పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా గొడవలు, అల్లర్లు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరిగాయి. లక్షెట్టిపేట్ సిఐ రమణ, జన్నారం ఎస్సై అనూష గ్రామ గ్రామాన తిరుగుతూ ఎన్నికల సజావుగా నడిచే విధంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని పోనకల్ గ్రామ సర్పంచ్ ఎన్నికలు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ సెకండరీ పాఠశాలలో ఎంతో ఉత్కంఠగా ఎన్నికలు జరిగాయి. ఇక్కడ ఎలాంటి అల్లర్లు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయడంతో సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరిగాయి. మధ్యాహ్నం మూడు గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ మొదలయింది. మొదటగా వార్డు సభ్యుల కౌంటింగ్ ప్రారంభించారు. సాయంత్రం ఏడు గంటల వరకు పొనకల్ గ్రామ పంచాయితిలోని తొమ్మిది వార్డు సభ్యుల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో ఒకటవ వార్డ్ ముద్రకోళ్ళ హరిక, రెండవ వార్డు పిల్లి మల్లయ్య, మూడవ వార్డు జాజాల శ్రీలత, నాలుగవ వార్డు కమరున్నీస బేగం, ఐదవ వార్డు రవీందర్, ఆరో వార్డు నగురు సుజాత, ఏడో వార్డు అప్పాల జలపతి, ఎనిమిదో వార్డు మోసిన్ ఖాన్, తొమ్మిదో వార్డు సంతోష్ గెలుపొందారు. ఇంకా కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుంది.



## రామకోటి ముగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

**నేరడిగొండ, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని సవర్గావ్ రోడ్డులో గల శివాలయంలో గత 5 రోజుల నుండి జరుగుతున్న శ్రీ రామ కోటి ఆఖరి రోజు సందర్భంగా గురువారం నిర్వహించిన పూజలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, విడిసి చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమణ, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, గులాబ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# రక్షణతో కూడిన ఉత్పత్తే మన లక్ష్యం

**శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ - శ్రీరాంపూర్ ఓసీలో ఘనంగా 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు**

నస్పూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించినప్పుడే సంస్థ పురోభివృద్ధి సాధ్యమని, రక్షణ ఉత్పత్తి రెండూ సమాంతరంగా సాగాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఉపరితల గని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో నిర్వహించిన 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను ఆయన, బెల్లంపల్లి ఏరియా ఇంజనీర్, రక్షణ వారోత్సవాల ఇన్‌స్పెక్షన్ కమిటీ కన్వీనర్ జి. కృష్ణమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ఉత్పత్తి, ఉత్పాదకతలోనే కాకుండా రక్షణలోనూ ముందంజలో ఉందన్నారు. గత ఏడాది రక్షణ విభాగంలో సింగరేణి వ్యాప్తంగా మూడు బహుమతులు సాధించామని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా రక్షణలో మొదటి స్థానాన్ని సాధించేలా కృషి చేయాలన్నారు. రక్షణ అనేది కేవలం ఈ పదిహేను రోజుల పక్షోత్సవాలకే పరిమితం కాకుండా, ప్రతి రోజు, ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలన్నారు. మన మదిలో.. గనిలో.. పనిలో.. రక్షణ ఉండాలి అని నినదించారు. ప్రతి ఉద్యోగి బూట్లు, హెల్మెట్, రేడియం జాకెట్ తదితర రక్షణ పరికరాలు ధరించి విధులకు హాజరుకావాలని సూచించారు.



మాట్లాడుతున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

## ఇంటి నుంచే రక్షణ ప్రారంభం కావాలి

**- కన్వీనర్ కృష్ణమూర్తి**

ఇన్‌స్పెక్షన్ కమిటీ కన్వీనర్ జి. కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి ఇంటి నుంచే రక్షణతో విధులకు బయలుదేరాలని, ఇది సమాజానికి మంచి సంకేతాన్ని ఇస్తుందన్నారు. విధి నిర్వహణలో రాజీపడకుండా, సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పాటిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గని మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన ప్రథమ చికిత్స (సీపీఆర్) విధానం ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులను, ఉద్యోగులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే కమ్యూనికేషన్ సెల్ వారి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, ఏరియా ఇంజనీర్ టి. రమణ రావు, ప్రాజెక్టు ఇంజనీర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, గని మేనేజర్ ఐ. శ్రీనివాస్, గని ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులు, రక్షణ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి

## జోరుగా కొనసాగుతున్న ప్రచారం

బజార్‌హత్నూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:

మండలంలోని మూడో విడత ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పరచ సాయన్న, ఆయా వార్డు సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అడవి పందులు అడ్డురాగా ఉద్యోగి మృతి

సారంగాపూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:

అడవి పందులు అడ్డురాగా ఉద్యోగి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం చించొలి(బి) గ్రామానికి చెందిన దేవత రాజేందర్(30) బుధవవారం రాత్రి పని నిమిత్తం దని గ్రామానికి వచ్చి తిరిగి తన ఇంటికి చించొలి(బి) గ్రామానికి బైక్ పైన వస్తుండగా, ధని శివారు మూలమలుపు వద్ద ఆకస్మాత్తుగా అడవి పందులు అడ్డు రాగ ప్రమాదం జరిగింది. బైక్ పై నుండి కిందపడడంతో తల వెనుక భాగంలో గాయాలు అవ్వడంతో వెంటనే తెలిసిన వ్యక్తులు నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లరు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరణించాడు. రాజేందర్ రైల్వేస్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## ఇంటింటి ప్రచారంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:

అభ్యర్థుల గెలుపు కోసం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజలను కలిశారు. గురువారం ఆసిఫాబాద్ మండలం రాజంపేట గ్రామపంచాయతీలో ఆ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బుర్స పోచయ్య, వార్డ్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ప్రజలకు పూర్తి భరోసా కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సకోల సరస్వతి, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్ భాయ్, కోవ సాయినాథ్ మరియు కార్యకర్తలు, నాయకులు గంధం శ్రీను, నిస్సార్ భాయ్, అన్సార్ భాయ్, చిలువేరు వెంకన్న, సాజిద్, ఉమారాణి, లలిత, సుప్రజ, సంగీత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

## ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

బజార్‌హత్నూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:



ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని బజార్‌హత్నూర్ గ్రామపంచాయతీ బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సీడం వికాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడం వికాస్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరంగా వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందేలా చూస్తానని, యువత ఉద్యోగాల కోసం ఉద్యోగమేల నిర్వహిస్తానని, అంతరించిపోతున్న కోలాటాలను, కోలాట కళాకారులకు పూర్వ వైభవం తీసుకొస్తానని, పదవ తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష ఫీజు తన సొంత డబ్బుతో చెల్లిస్తానని, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే వారికి స్టడీ హాల్ ఏర్పాటు చేస్తానని, తన ఆత్మ సాక్షిగా హామీ ఇస్తున్నానని గ్రామంలో ముందుకు సాగుతున్నానని అన్నారు.



ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి

## కొనసాగుతున్న ప్రచారం

బజార్‌హత్నూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాలలో మూడవ విడత ప్రచారం హోరా హోరీగా కొనసాగుతుంది. బజార్‌హత్నూర్ గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జల్కే పాండురంగ్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు వివరిస్తూ, అభివృద్ధి జరగాలన్న, పల్లెలు బాగుపడాలన్న, ప్రతి పేదవారికి, ఇందిరమ్మ ఇండ్లు రావాలన్నా ప్రజా ప్రభుత్వం రావాలని ప్రజలకు వివరిస్తూ ప్రజలలో మమేకమవుతున్నారు. ఆయన వెంట వివిధ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ఏడు కిలోమీటర్లు నడిచి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న గాయకిపల్లె గ్రామవాసులు

## ఓటు వేయడం కోసం ఏడు కిలోమీటర్ల ప్రయాణం

ఇచ్చోడ, డిసెంబర్ 11, ప్రభాతవార్త:

మండలం కేంద్రంలోని మార్కాపూర్ గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గాయికిపల్లె గ్రామానికి చెందిన 150 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలంటే 7 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కాపూర్ గ్రామపంచాయతి పరిధిలోని మేడిగూడలో ఓటింగ్ నిర్వహించారు. గాయికిపల్లె గ్రామస్థులు అంత దూరం నడిచి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సంఘటన ద్వారా ప్రజాస్వామ్యానికి పల్లెలు పట్టుకొమ్మలు అని తెలుస్తుంది. పట్టణాలలో కూతవేటు దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నాగాని వినియోగించుకొని పట్టణ ప్రజలకు గాయకిపల్లె గ్రామ ప్రజలు గుణపాఠంగా నిలిచారు.

## ఉత్కంఠ భరితంగా సాగిన సర్పంచ్ ఎన్నిక

**- లక్కీడ్రా ద్వారా సర్పంచ్ సర్పంచ్ ఎంపిక**

ఇచ్చోడ, డిసెంబర్ 11, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని డాబా(బి) గ్రామంలో పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినప్పటికీ సర్పంచ్ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. భారీ ఉత్కంఠకు తెరలేపింది. మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ మొదలైంది. అనంతరం పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఒక 176 ఓట్లు వచ్చాయి. దీంతో లక్కీ డ్రా అనివార్యమైంది. లక్కీ డ్రా నిర్వహించగా ఈశ్వర్ విజేతగా ప్రకటించబడ్డాడు.

## పది ఫలితాల్లో కార్పొరేట్‌కు ధీటుగా నిలవాలి

**- సిసిసి పాఠశాల సందర్శనలో జి.యం వెంకటాచారి**

నస్పూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త



కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పదవ తరగతి ఫలితాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సింగరేణి ఎడ్యుకేషన్ జి.యం ఎస్. వెంకటాచారి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ సిసిసి సింగరేణి హైస్కూల్‌ను కరస్పాండెంట్ యం. రాజేష్‌తో కలిసి సందర్శించారు. పాఠశాల రికార్డులు, తరగతుల నిర్వహణను హెచ్.ఎం బి. శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సింగరేణి యాజమాన్యం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యా ప్రమాణాలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులు

# కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

**- బిజెపి బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించండి**

**- బిజెపి జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్**

**తాండూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**

కేంద్రంలోని మోదీ సర్కార్ మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బిజెపి మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్ అన్నారు. నీలాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పుల్లాయిగూడెం, వడ్డెర కాలనీ, నీలాయపల్లి గ్రామాలలో గురువారం బిజెపి బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి తర్మని ఈశ్వరి తరపున ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిజెపి నాయకులు ఓటర్లు కలిసికేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలు, గ్రామాలకు అందుతున్న సేవలు, ప్రయోజనాలు గురించి వివరించారు. బిజెపి బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఈశ్వరి బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యంగార్ తుకారం, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి మామిడి విగ్నేష్, నాయకులు ప్రశాంత్, గణపతి, సంతోష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి విడత ఎన్నికల నిర్వహణపై వెబ్ కాస్టింగ్ ద్వారా నిశిత పర్యవేక్షణ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగిన ఎన్నికల నిర్వహణ వెబ్ కాస్టింగ్ ద్వారా నిచితంగా పర్యవేక్షించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ద్వారా జిల్లా ఎస్పి నితికా పంత్, ఎన్నికల పరిశీలకులు వి.శ్రీనివాస్ లతో కలిసి మొదటి విడత ఎన్నికల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025 మొదటి విడతలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరిగిందని, నెట్ వర్క్ లేని పోలింగ్ కేంద్రాలలో వాకీ టాకీ ద్వారా పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అనుచితమైన సంఘటనలు ఏర్పడినా వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వెబ్ క్యాస్టింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

# ఎన్నికల విధులను ఆన్ డ్యూటీగా పరిగణించాలి

**- కోడ్ 8021తో ఉద్యోగులకు ఆర్థిక, ప్రమోషన్ నష్టాలు - గుర్తింపు సంఘం నాయకులు - శ్రీరాంపూర్ జీఎంకు వినతిపత్రం అందజేత**

**నస్పూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త**



జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సింగరేణి ఉద్యోగుల విధులను స్పెషల్ ఎలక్షన్ లీవ్ (కోడ్ 8021)గా కాకుండా, ఆన్ డ్యూటీగా పరిగణించాలని గుర్తింపు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించడం రాజ్యాంగ బాధ్యత అయినప్పటికీ, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణ, ఎన్నికల విధులను స్పెషల్ లీవ్ కింద చూపడం వల్ల ఫిజికల్ అటెండెన్స్ తగ్గిపోతోందని, తద్వారా ఆదివారం అలవెన్సులు, ప్రాఫిట్ షేర్ ఇన్సెంటివ్‌లు కోల్పోతున్నారని వివరించారు. ప్రధానంగా మస్టర్ తగ్గిపోవడం వల్ల అంతర్గత పరీక్షల్లో మార్కులు తగ్గి, ప్రమోషన్లలో సీనియర్లు నష్టపోతూ, జూనియర్లకు అవకాశాలు వెళ్తున్నాయన్నారు. గత ఎన్నికల సమయంలోనూ ఇదే జరిగిందని, ఈసారైనా ట్రైనింగ్, ఎన్నికల విధులను ఆన్ డ్యూటీగా పరిగణించి, టి.ఏ/డి.ఏలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే మూడవ రోజు రెస్ట్ డే/ఓడి ఇవ్వాలని, రొటేషన్ పద్ధతి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, జీఎం కమిటీ ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శులు సందీప్, రాజు, నాయకులు రాజశేఖర్, రామ్ చందర్, రాజేష్, కోతి శ్రీధర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త**



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

ఈ నెల 23న నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై గురువారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో వేడుకలకు సంబంధించిన పనులను ఆయా విభాగాల అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. 23న ఉదయం 9.30 గంటలకు జీఎం ఆఫీస్‌లో, 11 గంటలకు స్టేడియంలో జెండా ఆవిష్కరణ, సాయంత్రం 5.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మానం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజెంట్లు, అధికారుల సంఘం అధ్యక్షులు కే. వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ టి. రమణ రావు, ఏజెంట్లు కుర్మ రాజేందర్, జి. రవి కుమార్, డీజీఎంలు ఎస్. అనిల్ కుమార్, పి. రాజన్న, ఆనంద్ కుమార్, హరి నారాయణ, రవీందర్, మల్లయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# మనోవికాస్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**మందమర్రి, డిసెంబర్ 11, ప్రభాతవార్త**



మందమర్రి ఏరియాలోని స్థానిక సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 3న జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మనోవికాస్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రోజున ఉదయం ఆటల పోటీలలో గెలుపొందిన మనోవికాస్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్.శ్రీవాణి రాధాకృష్ణ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని దివ్యాంగుల పిల్లలతో ఈరోజు ఇక్కడ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఓపికతో ఎంతో శ్రమకు ఓర్చి ఇలాంటి పిల్లలకు చదువు చెప్పడం, కొన్ని పనులలో నేర్పరులనుగా చేయడం, ఇక్కడ వారికి శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, ఆయాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. దివ్యాంగులు చాలా శక్తివంతమైన వారని వారిలో ఏదో తెలియని శక్తి దాగి ఉంటుందని దానిని వెలికి తీసి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అలాగే మనోవికాస్ స్కూల్ పిల్లలకు మన సింగరేణి ఉద్యోగులు కూడా సహకరిస్తున్నరని, ఇంకా ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడుతున్న అందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. మనో వికాస్ స్కూల్‌కు ఎలాంటి అవసరతలు ఉన్న తీర్చాలని దానికి సంబంధించిన అధికారులకు తెలియజేశారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం మనోవికాస్ విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి రమణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్ అశోక్, సీనియర్ పిఓ శంకర్, టి.సురేఖ, (మనోవికాస్ స్పెషల్ స్కూల్ మందమర్రి ఇంచార్జ్), టి.రాజలింగు (పేరెంట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మందమర్రి), తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.